# ప్రమాదకరంగా మూలమలుపులు

- రహదారుల్లో కానరాని సూచికబోర్డులు, స్పీడ్ బ్రేకర్లు
- ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని సంబంధిత అధికారులు

**నడిగూడెం :** మండల పరిధిలోని పలు గ్రామాల్లో వెళ్లే రహదారులు ప్రమాదకరంగా మారాయి. దీంతో ఈ రహదారుల్లో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ ప్రమాదాల్లో గాయపడడంతో పాటు పలువురు మృత్యువాత పడిన ఘటనలు కూడా ఉన్నాయి. ప్రధానంగా మండల కేంద్రంలోని మసీదు సెంటర్, తెల్లబెల్లి నుంచి రత్నవరం గ్రామానికి వెళ్లే రహదారి, రామాపురం నుంచి ఎక్లాస్‌ఖాన్‌పేటకు వెళ్లే రహదారి, నడిగూడెం నుంచి చాకిరాల గ్రామాల మధ్య నాలుగు చోట్ల, సాగర్ ఎడమకాల్వ వద్ద ప్రధాన రహదారి, సిరిపురం నుంచి నారాయణపురంకు వెళ్లే మార్గంలో, వేణుగోపాలపురం నుంచి బృందావనపురంకు వెళ్లే రహదారి, కరివిరాల నుంచి చెన్నకేశ్వాపురంకు వెళ్లే రహదారిపై మూడు చోట్ల, తెల్లబెల్లి నుంచి ఎక్లాస్‌ఖాన్‌పేటకు వెళ్లే రహదారిపై, వల్లాపురం నుంచి చనుపల్లికి వెళ్లే రహదారిపై రెండు చోట్లలో మూల మలుపులు అత్యంత ప్రమాదకరంగా మారాయి. ఈ మార్గాలలో మూలమలుపులతో పాటు కంపచెట్లు దట్టంగా అల్లుకుపోవడంతో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. నడిగూడెం, చాకిరాల రహదారిపై సాగర్ కాల్వ వద్ద రెండేళ్ల కిందట జరిగిన రెండు ప్రమాదాల్లో ఆటోలు బోల్తా పడ్డాయి. ఈ ప్రమాదాల్లో చాకిరాలకు చెందిన ఓ యువకుడు, మునగాల మండలం కలకోవకు చెందిన ఓ వృద్ధురాలు మృత్యువాతపడ్డారు. ఇంకా పలువురు క్షతగాత్రులయ్యారు. రత్నవరం, తెల్లబెల్లి గ్రామాల మధ్య ఏడాది కిందట ఎదురెదురుగా ద్విచక్రవాహనాలు ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందారు. నారాయణపురం, సిరిపురం గ్రామాల మధ్య ఉన్న సాగర్ ఎడమకాల్వ వద్ద మూలమలుపు వద్ద ఏడాది కిందట జరిగిన ప్రమాదంలో ఖమ్మం జిల్లాకు చెందిన ఓ వ్యక్తి మృతిచెందాడు. అలాగే ఈ రహదారులపై అనేకసార్లు ద్విచక్రవాహనాలు, ఆటోలు కూడా ప్రమాదాలకు గురయ్యాయి. ఇటీవల చాకిరాల నాలుగు రహదారుల వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. నడిగూడెం నుంచి బృందావనపురం గ్రామానికి వెళ్లే రహదారిలో మూల మలుపు వద్ద ద్విచక్రవాహనం అదుపు తప్పిపడడంతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి.


నడిగూడెం వద్ద ప్రమాదకరంగా ఉన్న మూలమలుపు


చాకిరాల వద్ద ఉన్న మూలమలుపు

### పత్తాలేని హెచ్చరిక బోర్డులు..

మండల వ్యాప్తంగా ఉన్న ఈ రహదారుల్లో ఎక్కడా కూడా హెచ్చరికల బోర్డులు లేవు. దీంతో వేగంగా వస్తున్న వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా సంబంధిత రోడ్లు, భవనాల శాఖ అధికారులు స్పందించి మూల మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

### నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి



వల్లాపురం నుంచి కోదాడకు, నడిగూడెంకు, నాయకన్‌గూడెంకు, చనుపల్లికి వెళ్లే రహదారులపై అనేక చోట్ల మూల మలుపులు ఉన్నాయి. ఈ రోడ్లలో నిత్యం గతంలో అనేక సార్లు ప్రమాదాలు జరిగాయి. కాని ఇప్పటికీ సూచికబోర్డులు, స్పీడ్ బ్రేకర్లు కాని ఏర్పాటు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వాహనదారులు ప్రమాదాల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలి.

– ఎస్‌కె.ఉద్దండు, వల్లాపురం

### ప్రమాదాలపై అధికారులు స్పందించాలి



నిత్యం ప్రమాదాలు జరుగుతున్న రహదారులపై సంబంధిత అధికారులు స్పందించాలి. మూలమలుపుల వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలి. అదే విధంగా రోడ్డుకు ఇరువైపులా ఉన్న కంపచెట్లను తొలగించాలి. రహదారులను వెడల్పు చేయాలి. నడిగూడెం నుంచి చాకిరాలకు, కాగితరామచంద్రాపురం, బృందావనపురంకు వెళ్లే రహదారులు మూలమలుపులతో ప్రమాదకరంగా మారాయి.

– గంటెపంగు నాగరాజు, నడిగూడెం

## క్లుప్తంగా

### దరఖాస్తుల ఆహ్వానం

**నడిగూడెం :** మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి గాను ఓపెన్ టెన్త్, ఓపెన్ ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అధ్యయన కేంద్రం కోఆర్డినేటర్ ఎం.శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అడ్మిషన్ కోసం అర్హత ఉన్న అభ్యర్థులు టీసీ, ఆధార్‌కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, ఓ పాస్ ఫొటోతో పాఠశాలలో అందజేయాలని, మరిన్ని వివరాలకు 95535 43180ను సంప్రదించాలని కోరారు.

### ఆర్–9 లిఫ్ట్‌కు నీటి విడుదల


నీటిని విడుదల చేసిన చైర్మన్ లింగారెడ్డి

**మునగాల :** మండలంలోని మునగాల శివారులో ఉన్న ఆర్–9ఎత్తిపోతల పథకానికి ఆదివారం లిఫ్ట్ చైర్మన్ వి.లింగారెడ్డి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఏడాది లిఫ్ట్‌కు సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్లు చోరీ జరగడంతో ప్రభుత్వం ట్రాన్స్‌ఫార్మర్ల కొనుగోలు, మైనర్ రిపేర్లకు రూ.40లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం 500కేవీ ట్రాన్స్‌ఫార్మర్ మాత్రమే ఏర్పాటు చేయడంతో మూడు మోటార్ల ద్వారా నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో లిఫ్ట్ ఆపరేటర్లు పందిరి శ్రీనివాసరెడ్డి, దేవరం శ్రీనివాసరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

### గ్రామంలో రక్తనమూనాలు సేకరించాలి


ఆర్‌ఎంపీ వద్ద చికిత్స కోసం వేచి ఉన్న జ్వరపీడితులు

**హుజూర్‌నగర్‌రూరల్ :** గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేసి విషజ్వరాల బాధితుల రక్త నమూనాలను సేకరించాలని న్యాయవాది కాల్వ శ్రీనివాసరావు కోరారు. ఆదివారం మండల పరిధిలోని గోపాలపురంలో జ్వర బాధితులను ఆయన పరామర్శించి అనంతరం మాట్లాడారు. నెల రోజులుగా గ్రామస్తులు జ్వరాలతో బాధపడుతుంటే ఆరోగ్య సిబ్బంది మాత్రం నామమాత్రంగానే వచ్చి పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే గ్రామంలో రక్త నమూనాలు సేకరించి అనంతరం నివేదిక ప్రకారం వైద్యం అందించి ఉచిత మందులు అందజేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట పలువురు గ్రామస్తులు ఉన్నారు.

### ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్రం


సమావేశంలో మాట్లాడుతున్న ధనుంజయనాయుడు

**నేరేడుచర్ల :** కేంద్ర ప్రభుత్వం రైతు, ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తుందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధనుంజయనాయుడు అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏఐవైఎఫ్ పట్టణ కమిటీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. దేశాన్ని బడా వ్యాపారుల చేతుల్లో పెటి వారికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. బడాబాబులు చేసిన రూ.16 లక్షల కోట్ల అప్పులను మోదీ ప్రభుత్వం రద్దు చేసిందని, దేశ సంపద కొద్ది మంది చేతుల్లోనే ఉందని, వాటిని పేద ప్రజలకు పంపిణీ చేయాలని డి మాండ్ చేశారు. సమావేశంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలక రాజు శ్రీను, దోమకొండ సురేష్, కర్నాటి నర్సిరెడ్డి, నాయకులు తదితరులున్నారు.

### లక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవం


స్వామి వారికి కల్యాణం జరిపిస్తున్న వేద పండితులు

**చివ్వెంల :** స్వాతినక్షత్రాన్ని పురస్కరించుకొని ఉండ్రుగొండ గ్రామ శివారులోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం స్వామివారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు మంత్రోచ్ఛరణతో భూదేవి, శ్రీదేవి సమేతంగా స్వామివారికి కల్యాణం జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా ముత్యాలమ్మకు బోనాలు


మఠంపల్లిలో బోనాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న గ్రామ మహిళలు


నడిగూడెం : బొడ్రాయి వద్ద పూజలు నిర్వహిస్తున్న గ్రామస్తులు

**మఠంపల్లి :** మండల కేంద్రంలో ఆదివారం గ్రామ దేవతలకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని బొడ్రాయికి పసుపు కుంకుమలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి ముత్యాలమ్మ అమ్మవారికి చీరె, సారెలు, నైవేద్యం సమర్పించి తమ మొక్కులను చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

**నడిగూడెం :** మండల పరిధిలోని రామాపురంలో ఆదివారం బోనాల పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో పెద్ద ఎత్తున బోనాలతో మహిళలు ఊరేగింపు నిర్వహించారు. అనంతరం బొడ్రాయి వద్ద ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

**మోతె :** మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో ముత్యాలమ్మ బోనాల పండగను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు గ్రామ దేవతలకు కోళ్లను, యాటపోతులను బలిఇచ్చారు. అనంతరం మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు.

### ముత్యాలమ్మకు ఒడి బియ్యం, చీర, సారె సమర్పణ

**హుజూర్‌నగర్ :** శ్రావణమాసం మొదటి ఆదివారాన్ని పురస్కరించుకుని పట్టణంలోని మూడుగుళ్ల ముత్యాలమ్మ (చిన్న ముత్యాలమ్మ) ఆలయంలో శ్రీశైవ క్షేత్ర వనితా శక్తి ఇంటర్నేషనల్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో అమ్మవారికి ఒడి బియ్యం పోసి గాజులు పసుపు, కుంకుమ చీర, సారెలు సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ఆ సంఘం అధ్యక్షురాలు టి.నాగలక్ష్మి మాట్లాడారు. పాడిపంటలు సంవృద్ధిగా పండి ప్రజలు ఆయురారోగ్యాలతో ఎల్లవేళలా సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. ఇదే విధంగా ఆషాఢమాసంలో కూడా పెద్ద ముత్యాలమ్మ తల్లి (చర్ల పోచమ్మ)కి వందలాది మందితో పూజలు చేసి చీర, సారె సమర్పించామన్నారు. కార్యక్రమంలో వనితా శక్తి కార్యదర్శి టి.సుజాత, కోశాధికారి వి.పద్మ, అధిక సంఖ్యలో మహిళా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


హుజూర్‌నగర్ : అమ్మవారికి ఒడిబియ్యం సారె సమర్పిస్తున్న మహిళలు


మోతె : ముత్యాలమ్మ అమ్మవారికి బోనాలు సమర్పిస్తున్న భక్తులు

## వెంకట్‌రెడ్డి సేవలు మరువలేనివి

**కోదాడరూరల్ :** యూటీఎఫ్ సంఘం బలోపేతానికి గడ్డం వెంకట్‌రెడ్డి చేసిన సేవలు మరువలేనివని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. పట్టణంలోని నయానగర్‌కు చెందిన యూటీఎఫ్ సీనియర్ నాయకుడు, పెన్షనర్స్ రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు గడ్డం వెంకట్‌రెడ్డి ఆదివారం మృతి చెందడంతో ఆయన మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్సీ నర్సిరెడ్డి మాట్లాడారు. వెంకట్‌రెడ్డి సంఘం బలోపేతంతో పాటు, రిటైర్డ్‌పర్సన్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడిగా పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేశారని కొనియాడారు. అంత్యక్రియల్లో తెలంగాణ పౌరస్పందన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కెపి మంగా, జిల్లా అధ్యక్షుడు ఆర్.ధనమూర్తి, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు, టాప్రా జిల్లా అధ్యక్షుడు సోమయ్య, బంగారయ్య, భిక్షపతిరావు, వీరబాబు, పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.


గడ్డం వెంకట్‌రెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న గరిడేపల్లి జెడ్పీహెచ్‌ఎస్ 1986-87 బ్యాచ్ విద్యార్థులు

**గరిడేపల్లి:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1986–87 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని రోజంతా సంతోషంగా గడిపారు.

## చివరి భూములకు నీరందించాలి

**నేరేడుచర్ల :** నాగార్జునసాగర్ ఎడమకాల్వ పరిధిలో నిర్మించిన ఎల్–27 లిఫ్ట్‌కు మరమ్మతులు చేపట్టి కాల్వచివరి భూములకు సాగునీటిని అందించి పంటలను కాపాడాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అరిబండి సురేష్‌బాబు డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం సాగునీటిని విడుదల చేసినప్పటికీ ఎల్–27 లిఫ్ట్‌కు మరమ్మతులు చేపట్టకపోవడంతో ఈ లిఫ్ట్ పరిధిలోని నేరేడుచర్ల మండలం మేడారం, బక్కయ్యగూడెం, గరిడేపల్లి మండలంలోని మర్రికుంట, గడ్డిపల్లి, ఎర్రకుంట, పెన్‌పహాడ్ మండలంలోని దూపాడు, లింగాల గ్రామాల్లో అనేక ఎకరాలకు సాగునీరు లేక నారుమళ్లతో పాటు బోర్లు, బావులు పూర్తిగా ఎండిపోతున్నాయన్నారు. కనీసం బోర్లు, బావుల్లో కూడా నీరు లేకపోవడంతో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి లిఫ్ట్ మరమ్మతులకు నిధులు కూడా విడుదల చేయించారని, అయినా మోటార్లు రిపేర్లు ఉన్నాయని చెప్పడం సరికాదన్నారు. కనీసం అధికారులు ఈ విషయంపై స్పందించకపోవడం దురదృష్టకరమన్నారు. ఇప్పటికైనా ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి చొరవ చూపి లిఫ్ట్ మరమ్మతులను వెంటనే చేపట్టాలన్నారు.

## వేములూరు రిజర్వాయర్ ఎడమకాల్వకు నీరు విడుదల


యాతవాకిళ్ల వద్ద వేములూరు ఎడమకాల్వకు నీటిని విడుదల చేస్తున్న రైతులు, సిబ్బంది

**మఠంపల్లి :** మండలంలోని యాతవాకిళ్ల వద్ద గల వేములూరు రిజర్వాయర్ నుంచి ఎడమకాలువకు రైతులు, సిబ్బంది ఆదివారం సాగునీటిని విడుదల చేశారు.అదే విధంగా కాల్వలో పేరుకుపోయిన గుర్రపుడెక్క, కంపచెట్లను జేసీబీతో తొలగింపజేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడారు. సాగర్ ప్రాజెక్ట్ నుంచి నీరు వస్తున్నందున రిజర్వాయర్ నుంచి సాగుకు నీటిని విడుదల చేశామన్నారు. కార్యక్రమంలో రిజర్వాయర్ వర్క్‌ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు, సిబ్బంది ఉప్పతల కోటయ్య, మంచ్యాతండాకు చెందిన పలువురు రైతులు పాల్గొన్నారు.

## శివశంకర్ జీవితం స్ఫూర్తిదాయకం


శివశంకర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

**హుజూర్‌నగర్ :** కేంద్ర న్యాయశాఖ మాజీ మంత్రి దివంగత పుంజాల శివశంకర్ జీవితం స్ఫూర్తిదాయకమని జాతీయ బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు దూళిపాల శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం పట్టణంలో సంఘం ఆధ్వర్యంలో శివశంకర్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం శ్రీనివాసరావు మాట్లాడారు. శివశంకర్ అత్యంత పేద కుటుంబంలో జన్మించి ఉన్నత విద్యను అభ్యసించి న్యాయవాదిగా, న్యాయమూర్తిగా, కేంద్ర న్యాయశాఖ మంత్రిగా, పలు రాష్ట్రాల గవర్నర్‌గా సేవలు అందించారని తెలిపారు. బడుగు బలహీన వర్గాల అభివృద్ధే లక్ష్యంగా అనేక కార్యక్రమాలు చేపట్టారని అన్నారు. కార్యక్రమంలో సంఘం పట్టణ ఉపాధ్యక్షుడు చేపూరి నరసింహచారి, నాయకులు బి.నాగేశ్వరావు, ఎం.వెంకటేశ్వర్లు, కె.శేఖర్, ఎం.సైదయ్య, కె.శ్రీనివాస్, టి.వెంకన్నగౌడ్, పి.రవికుమార్, వై.వెంకటరమణ, వసంతరెడ్డి, అంజి, రంగయ్య, నాగాచారి, అమరాచారి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న దామోదర్‌రెడ్డి

**నేరేడుచర్ల :** రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేసేందుకు సిద్ధం కావాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుంటకండ్ల దామోదర్‌రెడ్డి అన్నారు. పట్టణంలో నిర్మించిన రిటైర్డ్ ఉద్యోగుల భవన ప్రారంభోత్సవంలో ఆదివారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వాలు మారుతున్నా రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదన్నారు. సమస్యలు పరిష్కారంతో పాటు హెల్త్‌కార్డులను మంజూరు విషయంపై రాష్ట్ర మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దామోదర రాజనర్సింహాలతో కలిపి ప్రభుత్వం సబ్ కమిటీ వేసిందన్నారు. ఇటీవల సమావేశమైన మంత్రులు రిటైర్డ్ ఉద్యోగుల హెల్త్‌కార్డుల విషయంలో నిర్ణయాన్ని ప్రకటించలేదన్నారు. రిటైర్డ్ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న నాలుగు ఇంక్రిమెంట్లు విడుదల చేయాలని, హెల్త్‌కార్డులను మంజూరు చేయాలని, 398 ఉపాధ్యాయులకు ప్రత్యేక ఇంక్రిమెంట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా 10 రిటైర్డ్ ఉద్యోగుల భవన నిర్మాణ పనులు కొనసాగుతున్నాయన్నారు. ముందుగా ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి రిబ్బన్‌కట్ చేసి భవనాన్ని ప్రారంభించారు. కొణతం గోపిరెడ్డి జ్ఞాపకార్థంగా ఆయన కుమారుడు కొణతం కృష్ణారెడ్డి-సంధ్య భవన నిర్మాణానికి స్థలాన్ని విరాళంగా అందించారు. ఈ సందర్భంగా ఆ దంపతులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావెళ్ల సీతరామయ్య, జిల్లా అధ్యక్షుడు నాగిరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బొల్లు రాంబాబు, పాలకవీడు ఎంపీపీ భూక్య గోపాల్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొణతం చినవెంకట్‌రెడ్డి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధనుంజయనాయుడు, మున్సిపల్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాశ్, వైస్‌చైర్మన్ అలక సరిత, మార్కెట్ కమిటీ చైర్మన్ విజయలక్ష్మి, వైస్ చైర్మన్ తాళ్లూరి లక్ష్మీనారాయణ, సంఘం నేరేడుచర్ల అధ్యక్ష, కార్యదర్శులు చింతకుంట్ల పూర్ణచంద్రారెడ్డి, పాతుగంటి సత్యనారాయణ, సభ్యులు సుందరయ్య, రామస్వామి, రమణారావు, బుచ్చిరెడ్డి, సోమయ్య, దేవయ్య, వెంకటేశ్వర్లు, నర్సిరహారావు తదితరులున్నారు.


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న నాయకులు

## మంద కృష్ణమాదిగ చిత్రపటానికి పాలాభిషేకం


పాలాభిషేకం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

**మునగాల :** ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు తీర్పు ఇవ్వడంతో హర్షం వ్యక్తం చేస్తూ మండలంలోని కలకోవలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ చిత్రపటానికి ఆదివారం పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎస్పీ జిల్లా అధికార ప్రతినిధి ఏపూరి రాజు మాదిగ మాట్లాడారు. ఈనెల 14న ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు వస్తున్న మంద కృష్ణమాదిగకు ఘనస్వాగతం పలికేందుకు ఎమ్మార్పీఎస్ శ్రేణులు కదలిరావాలని పిలుపునిచ్చారు. ఈ తీర్పుతో మాదిగ జాతి హర్షం వ్యక్తం చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి అంజయ్యమాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాతకోట్ల నాగరాజు, ఎంఎస్పీ మండల అధ్యక్షుడు ఎల్.శ్రీనివాస్‌మాదిగ, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు గుడిపాటి కనకయ్యమాదిగ, మండల ఉపాధ్యక్షుడు గద్దల అశోక్‌మాదిగ, మాజీ సర్పంచ్ చిర్రా శ్రీనివాస్‌మాదిగ, నాయకులు మాతంగి ఏసుబాబు, కుడుముల రాంబాబు, చిర్రా అంజి, పడిసిరి నరసింహారావు, కుడుముల కిశోర్, చిర్రా వెంకన్న, కుంభజడ శ్రీను, పాతకోట్ల కోటేష్ పాల్గొన్నారు.

## అర్హులైన రైతులకు రుణమాఫీ చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న స్టాలిన్‌రెడ్డి

**మునగాల :** రేషన్‌కార్డుతో సంబంధం లేకుండా అర్హులైన ప్రతి రైతుకు భూమి పట్టాదారు పాస్‌పుస్తకం ప్రామాణికంగా తీసుకొని రూ.2లక్షల వరకు రుణమాఫీ చేయాలని రైతు సంఘం మండల కమిటీ అధ్యక్షుడు దేశిరెడ్డి స్టాలిన్‌రెడ్డి కోరారు. ఆదివారం మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన రైతు సంఘం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మొదటి, రెండో విడత రుణమాఫీలో సాంకేతికంగా రుణమాఫీ కాని రైతులకు కూడా వెంటనే రుణమాఫీ చేసి యుద్ధ ప్రాతిపదికన కొత్త రుణాలను మంజూరు చేయాలన్నారు. వానాకాలం ప్రారంభమైనందున ఎకరానికి రూ.7,500ల చొప్పున రైతు భరోసా నిధులు ఇచ్చి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో సీఐటీయూ మండల కమిటీ కార్యదర్శి స్వరాజ్యం, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు సుంకరి పిచ్చయ్య, మండవ వెంకటాద్రి, మల్లారెడ్డి, జానకిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలి

**సూర్యాపేట రూరల్ :** గ్రామ దేవతల ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి అన్నారు. ఆదివారం టేకుమట్ల గ్రామంలో నిర్వహించిన శ్రీముత్యాలమ్మ దేవత విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవాలయంను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అంతకు ముందు దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో పటేల్ రమేష్‌రెడ్డికి ఘన సత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు గట్టు శ్రీనివాస్, డాక్టర్ రామ్మూర్తి యాదవ్, ఆలయ కమిటీ ముఖ్యులు తెడ్ల అశోక్, నాయకులు ఫారుక్, పిల్లల రమేష్‌నాయుడు, మచ్చ లింగయ్య, బొడ్డు నరేష్, నవీన్, గోపి, జానకిరాములు, లింగయ్య, శ్రీను, వరుణ్ పాల్గొన్నారు.